క్లుప్తంగా

నేడు వేంకటేశ్వరస్వామి జాతర

నారాయణపేట: జిల్లా కేంద్రంలోని బహార్‌పేటలో కొలువుదీరిన శ్రీ తిరుమలగుట్ట వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో గురువారం ఆషాఢ శుద్ధ తొలి ఏకాదశి సందర్భంగా జాతర మహోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు దేవస్థాన కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 9 గంటలకు జల్దిబిందె, స్వామివారికి మహాభిషేకం, ప్రత్యేక పూజలు చేస్తున్నామని చెప్పారు. సాయంత్రం 4 గంటలకు పల్లకీ సేవ, రాత్రి భజన కార్యక్రమం ఉంటుందన్నారు. 30 తేదీన శుక్రవారం రెట్టపట్ల పోటీలు ఉంటాయని, ఆసక్తి గల వారు పాల్గొనాలని సూచించారు. భక్తులు స్వామి వారి జాతరకు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఈద్గా ఆవరణలో పారిశుద్ధ్య పనులు



నారాయణపేట టౌన్: పవిత్ర బక్రీద్ పండుగను పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని బువ్వమ్మగట్టు సమీపంలో మున్సిపల్ కమిషనర్ సునీత ఆదేశాల మేరకు ఈద్గా ప్రాంగణంలో కార్మికులతో చెత్తాచెదారం, పిచ్చి మొక్కలను తొలగించి పరిశుభ్రం చేశారు. అలాగే మట్టి వేసి గుంతలు మూసివేశారు. ఈద్గా ఆవరణం వద్ద అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని వారు తెలిపారు. కార్యక్రమంలో గందె చంద్రకాంత్, కౌన్సిలర్ అమిరుద్దీన్, శానిటేషన్ సూపర్‌వైజర్లు శ్రీధర్, చెన్నకేశవులు పర్యవేక్షించి పనులను పరిశీలించారు.

'రైతుబంధు' దరఖాస్తుకు అవకాశం

మరికల్: కొత్త పాసు పుస్తకాలు వచ్చిన రైతులు రైతుబంధు కోసం దరఖాస్తు చేసుకోవడానికి మరో రెండు రోజులు మాత్రమే గడువు ఉందని ఏఓ శివకుమార్, ఏఈఓ పరశురాం బుధవారం ఒక ప్రకటనలో అన్నారు. ఇంత వరకు దరఖాస్తు చేసుకోని వారు ఈ నెల చివరి నాటికి రైతులు పట్టా పాసు పుస్తకం, ఆధార్, బ్యాంకు పుస్తకం జిరాక్స్‌లను వ్యవసాయ కార్యాలయంలో సమర్పించాలన్నారు. ఈ అవకాశాన్ని కొత్త పాసు పుస్తకాలు పొందిన రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మొక్కల పెంపకంపై అవగాహన



ధన్వాడ: మండల కేంద్రంలోని పెట్రోల్ బంక్ నుంచి లింగంపల్లి వరకు రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలు పెరగడం లేదని, ప్రతి మొక్క ఎండిపోతుందని బుధవారం ఫారెస్ట్ డిప్యూటీరేంజ్ అధికారి రఘునాథ్‌రెడ్డి ఉపాధి హామీ సిబ్బందికి వివరించారు. ఇక్కడ ఉన్నది సౌడు భూమి, అని ఇందులో మొక్కలు పెరగడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వేయాల్సిన ఎరువుల వివరాలను తెలియజేశారు. ఈసారి నాటిన ప్రతి మొక్క పెరిగేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.

మట్టి రోడ్డు పనులు ప్రారంభం



ధన్వాడ: మండలంలోని చీరల నర్సయ్యతండా నుంచి మడిగెలములతండా గుండా పిల్లిగుంట్ల తండా వరకు మట్టి రోడ్డు పనులు సర్పంచ్ హున్యానాయక్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. గ్రామానికి వచ్చే రోడ్డు పూర్తి దెబ్బతిని గుంతలమయంగా మారిందని, దీనివల్ల ద్విచక్రవాహనాలు కూడా వెళ్లే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. అందుకే గ్రామ పంచాయతీ నిధుల వెచ్చించి మట్టి రోడ్డు పనులను ప్రారంభించామని తెలిపారు. అధికారులు, ఎమ్మెల్యే స్పందించి బీటీ రోడ్డు మంజూరయ్యేలా చొరవ తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.

కేసీఆర్ జిమ్మిక్కులకు కాలం చెల్లింది

మరికల్: రాష్ట్ర సంపదతో ఇతర రాష్ట్రాల్లో రాజకీయం చేయాలని చూస్తున్న కేసీఆర్ జిమ్మిక్కులను ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వీరన్న, నాయకులు కృష్ణయ్య, రామకృష్ణ, హరీష్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ రాబోయే సాధారణ ఎన్నికల కోసం కాంగ్రెస్ రూపొందించిన మేనిఫెస్టోకు బీఆర్‌ఎస్ పునాదులు కదులుతున్నాయన్నారు. కాంగ్రెస్ ప్రవేశపెట్టిన ప్రజా సంక్షేమ మేనిఫెస్టోను గడప, గడపకు తీసుకెళ్లి ప్రచారం చేస్తామన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సీఎం కేసీఆర్‌కు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. సమావేశంలో ఆంజనేయులు, శేఖర్, సత్యన్న, మొగులప్ప పాల్గొన్నారు.

నత్తనడకన విస్తరణ పనులు

- అసంపూర్తి రోడ్డు పనుల వల్ల ఇబ్బందులు
- డ్రెయినేజీ నిర్మాణంలోనూ అలసత్వం
- ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని వైనం

నారాయణపేట టౌన్: జిల్లా కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తా నుంచి పాత బస్టాండ్, వీరసావర్కర్ చౌరస్తా వరకు రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్నారు. డివైడర్ పనులు పూర్తి కావడంతో మొక్కలు సైతం నాటారు. అయితే డివైడర్ నిర్మించిన తరువాత రోడ్డు విస్తరణ పనులను చేపడుతున్నారు. ఒకవైపు పాత రహదారిపై తారును తవ్వించారు. అయితే 10 రోజుల కిందట రోడ్డు తవ్వించి, అలాగే వదిలేయడంతో కంకర, రాళ్లు తేలి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డ్రెయినేజీ పనులు కోసం కూడా గుంతలు తవ్వడంతో ప్రధానంగా వివిధ దుకాణాలకు వెళ్లేందుకు జనం జంకుతున్నారు. విస్తరణలో పనుల్లో ముఖ్యంగా రోడ్ల రెండు వైపులా తవ్వకాలు చేపట్టారు. గతంలో ఇనుప స్తంభాలు ఉండగా, వాటిని తొలగించారు అయితే ఇనుప దిమ్మెలు సివిల్‌లైన్ నుంచి పార్కు రోడ్డు వరకు అలాగే వదిలివేయడంతో పాదాచారులు, వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఎటు చూసిన రోడ్డుపై మట్టి, వ్యర్థాలు, కంకర ఉండటంతో నానావస్థలు పడుతున్నామని వాహనదారులు వాపోతున్నారు. సివిల్ లైన్ రోడ్డులో ఆర్టీఓ కార్యాలయం, జిల్లా కోర్టు, ఎస్‌బీఐ బ్యాంక్, కెనరా బ్యాంకు, పోస్ట్ ఆఫీస్, పలు ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలు ఇదే దారిలో ఉండటంతో నిత్యం రద్దీగా ఉంటుంది. రోడ్డు, డ్రెయినేజీ కోసం గుంతలు తవ్వడంతో వర్షానికి ఆ ప్రాంతమంతా మురుగు నిల్వ ఉండడంతో ఇబ్బందులు తప్పడం లేదని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోని పనులు వేగవంతంగా చేపట్టి సమస్య పరిష్కరించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



సివిల్‌లైన్‌లో పాత తారు తవ్వడంతో కంకర తేలిన రోడ్డు



మినీ స్టేడియం ప్రహరీ వద్ద అసంపూర్తిగా నిర్మించిన డ్రెయినేజీ

వాహనదారులకు ఇబ్బందులు..



రోడ్డు విస్తరణ పనులు సక్రమంగా చేసి వాహనదారులకు ఇబ్బందులు రాకుండా చూడాలి. కానీ రోడ్డు, డ్రెయినేజీలు నిర్మాణాలు అసంపూర్తిగా చేపట్టడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. అధికారులు స్పందించి పనుల్లో వేగం పెంచి సమస్యను పరిష్కరించాలి.

– నారాయణ, నారాయణపేట

సమస్య పరిష్కరిస్తాం

విస్తరణ పనుల్లో భాగంగా రోడ్డుకు ఇరువైపులా డ్రెయినేజీ నిర్మాణాలు చేపడుతున్నారు. ఒకవైపు పూర్తయితే, మరో వైపు పనులు చేస్తున్నారు. పనుల్లో వేగం పెంచి ప్రజలకు ఎలాంటి సమస్య రాకుండా చూస్తాం.

– సునీత, మున్సిపల్ కమిషనర్

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



మాట్లాడుతున్న మేనేజర్ కల్పనారెడ్డి

ధన్వాడ: మండలంలోని రామకిష్టాయిపల్లిలో బుధవారం డీసీసీబీ బ్యాంకు ఆధ్వర్యంలో రైతులకు, ఖతాదారులకు ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ లవాదేవీలపై అవగాహన సదస్సు నిర్వహించారు. మరికల్ డీసీసీబీ మేనేజర్ కల్పనా రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బ్యాంకు ఖాతా కలిగి ఉండాలని, దీని వల్ల ప్రభుత్వం నుంచి వచ్చే లబ్ధి ఖాతాదారుల అకౌంట్‌లో పడుతుందన్నారు. బ్యాంకు ఖాతాదారులు వ్యక్తిగత బ్యాంకు వివరాలు ఓటీపీ వంటి వివరాలు ఎవరి వద్ద పంచుకోవద్దని సూచించారు. డిజిటల్ బ్యాంకింగ్ వల్ల ఎలాంటి సమయంలో అయిన ఆన్‌లైన్ ద్వారా లావాదేవీలు చేసుకోవచ్చని ప్రస్తుతం ప్రతి ఒక్కరూ ఆన్‌లైన్ బ్యాంకింగ్ వాడుతున్నారని తెలియజేశారు. అలాగే పీఎంజేడీవై, పీఎంఎస్‌బీవై పాలసీలు చేయడం వల్ల ఎలాంటి ప్రమాదం జరిగినా లేదా అనారోగ్యంతో మరణించిన రూ.రెండు లక్షల బీమా వర్తిస్తుందని తెలియజేశారు.

గ్రామ అభివృద్ధికి కృషి



సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్

మరికల్: ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల వల్లే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని సర్పంచ్ దేవమ్మ అన్నారు. మండలంలోని ఎలిగండ్లలో బుధవారం సీసీరోడ్డు పనులను ప్రారంభించారు. గ్రామంలో అన్ని రహదారులను సీసీరోడ్లుగా మార్చిన ఘనత తమకే దక్కిందన్నారు. ఎన్నడు చేయని అభివృద్ధి చేసి చూపించామని తెలిపారు. భవిష్యత్‌లో మరిన్ని అభివృద్ధి పనులు చేపడుతామని ఇందుకు గ్రామస్తుల సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మోహన్, ప్రకాష్‌శెట్టి, ఉస్సేన్, హన్మంతు, చిన్నబాలు, రాంసింగ్, లక్ష్మీనరసింహారెడ్డి పాల్గొన్నారు.

కోరం లేక సర్వసభ్య సమావేశం వాయిదా



సభ్యులతో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎంపీపీ

దామరగిద్ద: మండల సర్వసభ్య సమావేశం ప్రారంభం కాకుండానే వాయిదా పడింది. బుధవారం ఎంపీడీఓ సమావేశ మందిరంలో ఎంపీపీ అధ్యక్షతన చేపట్టాల్సిన సమావేశానికి 16 మంది సభ్యుల్లో కనీసం కోరం సభ్యులు హాజరు కాకపోవడంతో సభను వాయిదా వేస్తూ ఎంపీపీ నర్సప్ప, ఎంపీడీఓ విజయలక్ష్మి నిర్ణయం తీసుకున్నారు. ఉదయం 11 గంటలకు ఎంపీడీఓ వివిధ శాఖల అధికారులు హాజరు కాగా కేవలం మద్దెల్‌బీడ్, మొగుల్‌మడ్క, దామరగిద్దకు చెందిన ఎంపీటీసీ సభ్యులు మాత్రమే హాజరయ్యారు. దీంతో ఎంపీపీ, ఎంపీడీఓ గైర్హాజరైన సభ్యులకు ఫోన్ చేశారు. కాగా తమకు సమాచారం ఇవ్వలేదని కొందరు సభ్యులు ఆరోపించారు. ఈ సందర్భంగా ఎంపీపీ నర్సప్ప మాట్లాడుతూ సభ్యులకు సమాచార ఇవ్వకుంటే సమావేశానికి ఎలా హాజరతారని ఎంపీడీఓ, ఎంపీఈఓలను ప్రశ్నించారు. తాము సమాచారం అందించామని అయినా సభ్యులు హాజరు కాలేదని అధికారులు వాపోయారు. ఏది ఏమైనా అధికారులు, ప్రజాప్రతినిధులు మధ్య సమన్వయం కొరవడినట్లు సమాచారం. సమన్వయ లోపంతో కోరం సభ్యులు రాకపోవడం కారణంగా సభను వాయిదా వేశారు. ఎన్నికల కోడ్ పేరుతో ముందస్తుగా అధికారుల బదిలీల నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాలతో గతంలో ఉన్న ఎంపీడీఓ శశికళ మద్దూర్‌కు, మద్దూర్‌లో విధులు నిర్వహిస్తున్న ఎంపీడీఓ విజయలక్ష్మిని దామరగిద్ద మండలానికి బదిలీ చేశారు. ఈ విషయంలో ప్రస్తుత ఎంపీడీఓ, ప్రజాప్రతినిధులు మధ్య సమన్వయం లోపించడానికి కారణం అని అంటున్నారు.

నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఏర్పాటు



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ విక్రమ్

నర్వ: నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్‌ఐ విక్రమ్ అన్నారు. బుధవారం మండలంలోని రాయికోడ్‌లో పోలీస్ కళాజాతా బృందం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆట, పాటల ద్వారా వివరించారు. అనంతరం ఎస్‌ఐ మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. సైబర్‌నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్‌నేరాలకు గురైతే వెంటనే 1930కు, లేదా డయల్100కు నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. బాల్యవివాహాలు నివారణ అందరి బాధ్యత అన్నారు. అంటరానితనం, మూఢనమ్మకాలపై, షీటీమ్స్‌పై అందరికి అవగాహన ఉండాలన్నారు. కార్యక్రమంలో కళాజాత బృందం సభ్యులు కానిస్టేబుల్ సురేందర్‌గౌడ్, శేఖర్, లింగన్న, కల్యాణి, రుక్యానాయక్ తదితరులున్నారు.

జర్నలిస్టు రవికి ఘన నివాళి



మక్తల్: మండలంలోని జక్లేర్ గ్రామానికి చెందిన జర్నలిస్టు చెట్టుకింద రవి అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నారాయణపేట జిల్లా అధ్యక్షుడు వాకిటి శ్రీహరి, రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు కొండయ్య, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు రాజుల ఆశిరెడ్డి, రాష్ట్ర ముదిరాజ్ సంఘం ఉపాధ్యక్షుడు విజయ్‌కుమార్ గ్రామానికి చేరుకొని మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. బంధువులు, కుటుంబసభ్యులు స్నేహితులు కన్నీటి పర్యంతమయ్యారు. మృత్యుడికి భార్య సుజాత, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అంత్యక్రియలకు గ్రామస్తులు, జర్నలిస్టులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

సమాజ సేవయే లక్ష్యం



చెక్కు అందజేస్తున్న వర్కటం జగన్నాథ్‌రెడ్డి

మక్తల్: సమాజ సేవయే లక్ష్యంగా ముందుకు సాగుతానని వీజేఆర్ సేవ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు వర్కటం జగన్నాథ్‌రెడ్డి అన్నారు. మండలంలోని జక్లేర్ గ్రామానికి చెందిన హన్మంతు కుమారుడు ఉదయ్‌కుమార్ పదో తరగతి ఉత్తీర్ణుడై ఇంటర్ చదివేందుకు ఆర్థిక స్థోమత లేక ఇబ్బంది పడుతున్నాడు. బుధవారం విషయం తెలుసుకున్న వర్కటం జక్లేర్ గ్రామానికి చేరుకొని విద్యార్థి ఉదయ్‌కుమార్ ఇంటర్ విద్య కోసం రూ.1.05లక్ష అందజేశారు. హైదరాబాద్‌లోని చైతన్య ఆదిభట్ల బ్రాంచ్‌లో చదివించేందుకు ముందుకు వచ్చాడు. విద్యార్థికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థి తల్లిదండ్రులు వర్కటం జగన్నాథ్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాగస్వామి, రాఘవేందర్‌గౌడ్, సుదర్శన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అధ్యక్షుడికి సన్మానం



మక్తల్: మండల కేంద్రానికి చెందిన మాజీ ఎంపీటీసీ కోళ్ల వెంకటేష్ మత్స్య సహకార సంఘం నారాయణపేట జిల్లా అధ్యక్షుడిగా ఇటీవల ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ధర్మ సమాజ్ పార్టీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఆయన నివాసంలో పూలమాల శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పోర్ల డేవిడ్ మహరాజ్, జుట్ల ఓబులేస్, నర్సిములు, సురేష్, శివరాజ్, సూర్యప్రకాష్, కృష్ణ, అనిల్, వీరేష్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ ప్రధాని పీవీ జయంతి



నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మక్తల్: మాజీ ప్రధాని దివంగత పీవీ నర్సింహారావు జయంతిని బుధవారం కాంగ్రెస్ పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పీవీ నర్సింహారావు చిత్రపటానికి జిల్లా అధ్యక్షుడు వాకిటి శ్రీహరి పూలమాల వేసి నివాళులర్పించారు. పీవీ దేశానికి చేసిన సేవలను కొనియాడారు. అంతకు ముందు పాఠశాల ఎదుట జయంతి వేడుకలు జరుపుకున్నారు. కార్యక్రమంలో బి.నర్సిములు, గణేష్‌కుమార్, కట్ట వెంకటేష్, కట్ట సురేష్, నారాయణ, ఫయాజ్, ఆనంద్‌గౌడ్, డక్టర్ మల్లప్ప, ఓబులేష్, రాజేందర్, కిష్టప్ప, శేఖర్ శ్రీనివాసులు, రవికుమార్, బోయ రవి, గోవర్ధన్, కురుమన్న, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీలతో మేధోశక్తి పెరుగుతుంది

అమరచింత: కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించే రాజీవ్‌గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో యువత పెద్ద ఎత్తున పాల్గొనాలని పార్టీ పట్టణ అధ్యక్షుడు అరుణ్‌కుమార్ కోరారు. బుధవారం పట్టణంలోని ఉన్నత పాఠశాలలకు వెళ్లి రాజీవ్‌గాంధీ ఆన్‌లైన్ క్విజ్ పోటీల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. పోటీల్లో అధికంగా మహిళలు పాల్గొనేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. క్విజ్ పోటీల్లో గెలుపొందిన వారికి నియోజకవర్గం మొత్తంలో 43 బహుమతులు ఇస్తామన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో ప్రజలు అసంతృప్తితో ఉన్నారని సంక్షేమ పథకాలు కేవలం పార్టీ కార్యకర్తలకే అందుతున్నాయన్నారు. పట్టణంలో ఇప్పటి వరకు డబుల్ బెడ్‌రూం నిర్మాణాలు జరగకపోవడం ఏమిటన్నారు. శ్యామ్, ప్రకాశం పాల్గొన్నారు.

గోవులను రక్షించాలని తహసీల్దార్‌కు వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఊట్కూర్: గోవులను అక్రమంగా తరలించకుండా చర్యలు తీసుకోవాలని హిందువాహిని ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ తిరుపతయ్యకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా నగర అధ్యక్షుడు ధర్మప్రకాశ్ మాట్లాడుతూ బక్రీద్ పండుగ సందర్భంగా గోవులను వధశాలకు తరలించే అవకాశం ఉందని పేర్కొన్నారు. అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ రమేశ్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు రమేశ్, ఏబీవీపీ నాయకులు బాలాంజనేయులు, నాయకులు అరుణ్, అవినాష్, శంకర్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలు సాధిద్దాం



అంబేడ్కర్, జ్యోతిరావు పూలే విగ్రహాల ఆవిష్కరణలో వివిధ పార్టీల నాయకులు

మక్తల్: రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ ఆశయాలు సాధిద్దామని కాంగ్రెస్ పార్టీ నారాయణపేట జిల్లా అధ్యక్షుడు వాకిటి శ్రీహరి అన్నారు. బుధవారం మండలంలోని చిట్యాలలో డాక్టర్ అంబేడ్కర్, జ్యోతిరావు పూలే విగ్రహాలను సర్పంచ్ జానకి, ఎంపీటీసీ రామలింగంతో కలిసి ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పలువురు నాయకులు ఆయన సేవలు కొనియాడారు. బాబాసాహెబ్ సేవలు గుర్తించి ప్రభుత్వం భారతరత్న అవార్డు ఇచ్చిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు చిట్యాల లక్ష్మణ్, ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి బుజ్జప్ప, దత్తత్రేయ, గొల్లపల్లి నారాయణ, అంజప్ప, మద్దిలేటి, సూర్యచంద్ర, మలింటి హన్మంతు, లింగప్ప, నాగేందర్, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు



చేతికందే ఎత్తులో విద్యుత్ తీగలు

కోస్గి: మండలంలోని నాచారం గ్రామ శివారులో వ్యవసాయ బోర్లకు ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలు చేతికందె ఎత్తులో ఏర్పాటు చేశారు. విద్యుత్ తీగలు వేలాడుతూ ప్రమాదకరంగా మారాయని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పల్లె ప్రగతిలో ఫిర్యాదు చేసిన అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

బహిరంగ సభను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న భాస్కర్

ఊట్కూర్: ఈ నెల 29న ఆత్మకూర్ పట్టణంలో నిర్వహించే బీజేపీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి భాస్కర్ కోరారు. బుధవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ హాజరవుతారని తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు భరత్, మండల అధ్యక్షుడు రమేశ్, ఎంపీటీసీ హన్మంతు, నాయకులు కృష్ణయ్యగౌడ్, కొండన్ గోపాల్, వెంకట్‌రాములు, రమేశ్, రోషినప్ప తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకార్మికుడిని కాపాడిన యువకుడు

ఊట్కూర్: వలలో చిక్కుకొని చెరువులో మునిగిన మత్స్య కార్మికుడిని ఓ యువకుడు కాపాడాడు. స్థానికుల వివరాల ప్రకారం మండల కేంద్రంలోని సర్దార్‌నగర్ వీధికి చెందిన మత్యకార్మికుడు చాపలి బాలప్ప పెద్ద చెరువులో చేపలు పట్టేందుకు మంగళవారం రాత్రి వల కట్టి వెళ్లాడు. బుధవారం వల తీసేందుకు ప్రయత్నించగా వల కాళ్లకు చుట్టుకొని నీటిలో మునుగుతుండగా చెరువు గట్టుపైన ఉన్న పిల్లలు గమనించి కేకలు వేశారు. అక్కడే ఉన్న మొగ్గంపూర్ గ్రామానికి చెందిన యువకుడు శ్రీకాంత్ చెరువులోకి దూకి మత్స్యకార్మికుడు చాపలి బాలప్ప బయటకు తీసి రక్షించారు. సాహసం చేసి చెరువులోకి దూకి మత్యకార్మికుని ప్రాణాలను కాపాడిన శ్రీకాంత్‌ను గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు అభినందించారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం



నీటి సరఫరా ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ గందె అనసూయ

నారాయణపేట టౌన్: కొన్నేళ్లుగా శుద్ధ నీటి కోసం ఇబ్బందులు పడుతున్న పట్టణంలో 15 వార్డులో కొత్తగా మిషన్ భగీరథ పైప్‌లైన్ పనులు పూర్తి కావడంతో బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ గందె అనసూయ, కౌన్సిలర్ బండి రాజేశ్వరి కాలనీలో నీటి సరఫరాను ప్రారంభించారు. వార్డులో ఇంటింటికీ నల్లా కనెక్షన్ ద్వారా శుద్ధమైన తాగునీటి సరఫరా చేపట్టడంతో వార్డులో ప్రజలు, మహిళలు చైర్‌పర్సన్, కౌన్సిలర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ ఎవరు కూడా తాగునీటిని వృథా చేయకుండా అవసరమైన మేరకు వాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గందె చంద్రకాంత్, బండి శివరాంరెడ్డి, కడెంపల్లి రఘు, మున్సిపల్ శానిటేషన్ సూపర్‌వైజర్ శ్రీధర్, వాటర్ లైన్‌మెన్ అంజి, సిబ్బంది సుదర్శన్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నాసిరకంగా వంతెన నిర్మాణ పనులు



నాసిరకంగా నిర్మించిన వంతెన

అమరచింత: మండలంలోని కొంకన్‌వానిపల్లిలో నిర్మించిన వంతెన నాసిరకంగా నిర్మించారని సీపీఐ, ఏఐవైఎఫ్ నాయకులు ఆరోపించారు. నాసిరకంగా నిర్మించిన వంతెన పనులను మంగళవారం సందర్శించి పరిశీలించారు. ఈమేరకు వారు మాట్లాడుతూ కొంకన్‌వానిపల్లి–మద్దూర్ గ్రామాలకు వెళ్లడానికి ఉన్న మట్టి రహదారిలో గ్రామ సమీపంలో వంపు ఉండటంతో వర్షాకాలంలో రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఎన్నో ఏళ్లుగా సమస్య పరిష్కారం కోసం ఎమ్మెల్యేను విన్నవించడంతో రూ.ఐదు లక్షలు వంతెన కోసం మంజూరు చేశారు. ఎనిమిది నెలల కిందట పనుల కోసం భూమిపూజ చేసిన ఎమ్మెల్యే, వాటి నిర్మాణ పనులను వేగవంతగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ పిన్నంచర్ల వెంకటేష్ మూడు పైపులను వేసి వాటిపై పిట్ట గోడలను నిర్మించి మట్టితో గుంతలను పూడ్చి పనులను మమ అనిపించారని గ్రామస్తులు ఆరోపించారు. నాసిరకమైన పనులకు అదనంగా మరో రూ.ఐదు లక్షలు మంజూరు చేయాలని సంబంధిత కాంట్రాక్టర్ కోరడం వింతగా ఉందన్నారు. ప్రజలకు, రైతులకు పదికాలల పాటు ఉపయోగ పడాల్సిన వంతెనను నాసిరకంగా నిర్మించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రజలతో కలసి పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కుతుబ్, సీపీఐ నాయకులు ఆటో అంజి, కృష్ణయ్య పాల్గొన్నారు.